క్లుప్తంగా

ప్రొసీడింగ్‌లు అందజేత


ప్రొసీడింగ్‌లు ఇస్తున్న మంత్రి ఈశ్వర్

గొల్లపల్లి: మండలంలోని పలు గ్రామాలకు ఎస్‌డీఎఫ్ నిధుల కింద 44 అభివృద్ధి పనులకు రూ.3.7 కోట్ల నిధులు మంజూరు కాగా, ప్రొసీడింగ్ పత్రాలను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ కరీంనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. సీసీరోడ్లు, కుల సంఘ భవనాలు, చర్చి రిపేర్స్ బోర్‌వెల్స్, ఓపెన్ జిమ్, మహిళబూా సంఘం భవనాలు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు సంబందించిన ప్రొసిడింగులను కుల సంఘ సభ్యులకు మంత్రి అందజేశారు.

మంత్రి ప్రశాంత్‌రెడ్డిని కలిసిన నాయకులు


మంత్రి ప్రశాంత్‌రెడ్డితో బాపురెడ్డి,నాయకులు

కథలాపూర్: రాష్ట్ర రోడ్ల భవనాలశాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డిని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి శుక్రవారం కలిశారు. మండలంలోరోడ్ల పరిస్థితి, అభివృద్ధి పనులకు నిధుల మంజూరు గురించి చర్చించినట్లు తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ నాగం భూమయ్య, నాగేశ్వర్‌రావు ఉన్నారు.

అధ్యాపకురాలికి సన్మానం


అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీలత

జగిత్యాలటౌన్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్న బుర్ర సుమలత రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికై అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీలత సిబ్బంది సుమలతను శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ శ్రీలత మాట్లాడుతూ ఫిజిక్స్ సబ్జెక్టును విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే విధంగా సుమలత బోధన అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

మల్లాపూర్: సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ వాహిని అన్నారు. మండలంలోని వాల్గొండలో శుక్రవారం నిర్వహించిన హెల్త్ క్యాంప్‌లో గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల విద్యార్థులు ఆరోగ్యసూత్రాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. దోమల నివారణకు స్ప్రే చేయించాలని సూచించారు. అనంతరం 68మంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి 6 గురి రక్తనమునాలను సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఇల్లెందుల శ్రీనివాస్, ఇందిర, ల్యాబ్ టెక్నీషన్ ఉమాదేవి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితబంధు లబ్ధిదారుల వివరాలు ఇవ్వాలని వినతి

కథలాపూర్: కథలాపూర్, మేడిపెల్లి, బీమారం మండలాల్లో దళితబంధు పథకం లబ్ధిదారుల వివరాలు ఇవ్వాలని మండలాల అధికారులకు వినతిపత్రం ఇచ్చినట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్ శుక్రవారం తెలిపారు. ఆయా మండలాల్లోని బహుజన నాయకులతో కలిసి మూడు మండలాల అధికారులకు వినతిపత్రం సమర్పించినట్లు, మైనార్టీ, బీసీ బంధు లబ్ధిదారుల వివరాలు ఇవ్వాలని కోరామని తెలిపారు. మరోవైపు సమాచర హక్కు చట్టం ప్రకారం సమాచారం ఇవ్వాలని నిబంధనల మేరకు మరో లేఖ అధికారులకు అందించామని పేర్కొన్నారు.

కొండగట్టు అంజన్న హుండీ లెక్కింపు

కొండగట్టు: జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి వారి ఆలయ హుండీలను శుక్రవారం కరీంనగర్ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ సమక్షంలో లెక్కించారు. ఈ సందర్భంగా 30 రోజులకు గాను రూ.40.65 లక్షల నగదు, 72 గ్రాముల మిశ్రమ బంగారం, 1.700 కిలో గ్రాముల వెండి, 25 విదేశీ కరెన్సీ వచ్చినట్లు ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో వెంకటేశ్,ఏఈవో బుద్ది శ్రీనివాస్ సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపం అధిగమించేనా?

- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ పోషకాహార మాసం
- ఈ నెల 30 వరకు కార్యక్రమాలు
- బీఎల్వో విధుల్లో అంగన్‌వాడీ టీచర్లు
- కార్యక్రమ అమలుపై ప్రభావం


చిన్నారుల ఎత్తు కొలుస్తున్న అంగన్‌వాడీ టీచర్


రేగుంట అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్ (ఫైల్)

మల్లాపూర్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, బాలికల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు సెప్టెంబర్ నెలను జాతీయ పోషకాహార మాసంగా ప్రకటించారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా ఈ నెల 1 నుంచి పోషకాహార కార్యక్రమాలను ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్లు బూత్ లెవల్ అధికారులు (బీఎల్వో)గా సేవలు అందిస్తుండడంతో పోషకాహార మాసం కార్యక్రమాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కొన్ని రోజులుగా అంగన్‌వాడీ టీచర్లు బీఎల్‌వోలుగా విధులు నిర్వహిస్తున్నారు. పోషకాహార మాస కార్యక్రమాల్లో గర్భిణుల ఆరోగ్య రక్షణ, రక్తహీనత నివారణ, 0–6 ఏళ్ల లోపు పిల్లల్లో ఎత్తు, బరువు కొలతలతో పెరుగదల పర్యవేక్షణ, పరిశుభ్రత, బాలింతలు పోషకాహార ప్రాముఖ్యత, కిశోర బాలికలకు ఆహారంపైనే ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని, అవసరమైన పౌష్టికాహారం తీసుకుంటే శారీరక వికాసం సాధ్యమవుతుందని, లేకపోతే అనేక రుగ్మతల బారిన పడ ప్రమాదాలు పెరుగుతాయనే అవగాహన కల్పిస్తున్నారు. కానీ సరైన అవగాహన లేకపోవడం, పేదరికం కారణంగా చాలామంది పోషకాహార లోపంతో వివిధ రోగాల బారిన పడుతున్నారు. జిల్లాలోని 4 ప్రాజెక్టుల్లో ఉన్న 1065 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ పోషకాహార మాసోత్సవాలను ఈ నెలాఖరు వరకు నిర్వహించాల్సి ఉంది. దీనికి మహిళా, శిశు సంక్షేమశాఖ ప్రత్యేక కార్యచరణను సైతం రూపొందించింది. కానీ అంగన్‌వాడీ టీచర్లకు బీఎల్వోల విధులతో అదనపు బాధ్యతలతో పోషకాహార మాస కార్యక్రమాల అమలుపై ప్రభావం పడుతోంది.

జగిత్యాల జిల్లా ప్రొఫైల్ :	
ప్రాజెక్టులు :	04
మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు :	1065
ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు :	1037
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు :	28
0–6 ఏళ్లలోపు చిన్నారులు :	52,443
గర్భిణులు :	7,702
బాలింతలు :	7,038

నెలంతా ప్రత్యేక కార్యక్రమాలు..

పోషణ అభియాన్‌లో భాగంగా ఈ నెల 30 వరకు పలు కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. పిల్లల ఎత్తు, బరువు కొలతలను సేకరించడం, గర్భిణుల బరువు, భుజం కొలతలను తీసుకోవడం, పౌష్టికాహారంపై అవగాహన కల్పించడం, అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్ల ఏర్పాటు, కూరగాయలు, పండ్ల మొక్కలు, ఆకుకూరలు, సీ విటమిన్ అధికంగా ఉండే పండ్ల తోటల పెంపకం, ఆరోగ్యం కోసం యోగాసనాలు చేపట్టనున్నారు. పిల్లల్లో రోగనిరోధకత పెంపొందించడం, గర్భిణులకు కౌన్సెలింగ్ చేయడం, న్యూట్రీషియన్‌పై అవగాహన, కాల్షియం సరఫరా చేయడం, స్థానికంగా లభించే ఆహారాలను ప్రదర్శించి లబ్ధిదారులకు వివరించనున్నారు. పోషకాహారంపై విద్యార్థులకు రోజువారీ సందేశాలు ఇస్తూ వ్యాసరచన, డ్రాయింగ్, పోస్టర్ల తయారీ, హ్యాండ్‌వాష్ ప్రదర్శనలు, తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించనున్నారు.

కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం



పౌష్టికాహార మాసాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతిరోజూ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో పోషకాహార లోపాలను అధిగమించేందుకు ప్రభుత్వం కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. అంగన్‌వాడీ టీచర్లు బీఎల్వోలుగా విధులు నిర్వర్తిస్తున్నందునా మధ్యాహ్నం వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు, కార్యక్రమాలు నిర్వహించి, మధ్యాహ్నం బీఎల్వో విధులు నిర్వహించాలని తెలిపాం.

– నరేశ్, జిల్లా సంక్షేమ అధికారి,జగిత్యాల

నిరుపేదల సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయం

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


లబ్ధిదారులతో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్: నిరుపేదల సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని చెర్లకొండాపూర్ పెద్ద చెరువులో శుక్రవారం 1.70 లక్షల చేపపిల్లలను చెరువులో వదిలిపెట్టారు. 16 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నిరుపేదల సంక్షేమం కోసం ఎంతో పాటుపడుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ మారంపల్లి రాణి, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, చెర్లకొండాపూర్ సర్పంచ్ రాజ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతోనే పార్టీ బలోపేతం

సారంగాపూర్: ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి నచ్చి బీఆర్‌ఎస్ పార్టీలోకి ఇతర పార్టీల నుంచి చేరికలు పెరిగాయని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని రంగపేట గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పేద కుటుంబాలు, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికంగా నిలబడేస్థాయికి వచ్చాయన్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి తోడేటి శేఖర్‌గౌడ్, వైస్‌ఎంపీపీ సొల్లు సురేందర్, సర్పంచులు బొక్కం జమున, పల్లపు వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం


కల్లూర్‌లో నిల్వ నీటిని తొలగిస్తున్న సిబ్బంది

కోరుట్ల రూరల్: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, బీఎల్‌వోలు, పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ తిరిగి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇండ్లల్లోని టైర్లు, పాత రోళ్లు, కుండలు, కూలర్లలో నిల్వ ఉంచిన నీటిని తొలగింపజేశారు. నిల్వ నీటిలో ఉండే దోమలతో డెంగీ, విష జ్వరాలు ప్రబలే అవకాశాలున్నాయని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, ఎంపీపీ తోట నారాయణ, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చీటి వెంకట్రావు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

మల్లాపూర్: ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలతో స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో జగదీశ్ అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ సిబ్బంది పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. నిల్వనీటిని తొలగించడం , చేతులు కడుక్కొవడంలో మెళకువలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో పల్లె ప్రగతి కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తుండడంతో గణనీయ మార్పు చోటు చేసుకుంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన ర్యాలీలు

మెట్‌పల్లి: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. మెట్‌పల్లి పట్టణంలోని జ్ఞానోదయ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కు పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బీఎల్‌వో నజీమా, కరస్పాండెంట్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: మండలంలోని చౌలమద్దిలో ఓటర్ నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగారెడ్డి, కార్యదర్శి రవి, వీవోఏలు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకుని ఓటు శాతాన్ని పెంచాలని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో ఓటు హక్కుపై అవగహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభు, సర్పంచు నేమూరి లత, మండల కోఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి, ఎంపీటీసీ రాములు, పాల్గొన్నారు.

పెగడపల్లి:ప్రజాస్వామ్య వ్యవస్థలో మంచి సమాజాన్ని నిర్మించేందుకు ఓటు వజ్రాయుధమని 18 ఏళ్లు నిండిన ప్రతి ఒకరు ఓటుహక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎంఏ ఫరూక్ అన్నారు. అన్ని గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుల్లయ్య, ఎంపీవో మహేందర్, సర్పంచులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని దుంపేట, గంభీర్‌పూర్ గ్రామాల్లో మహిళ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ జవ్వాజి రేవతి, సర్పంచులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు


ప్రొసీడింగ్ పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

కోరుట్ల: పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు మంజూరైన ప్రొసీడింగ్ పత్రాలను ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు శుక్రవారం ఆయా సంఘాల నాయకులకు అందజేశారు. పట్టణంలోని డాగ్ బంగ్లా సమీపంలో ఈద్గా అభివృద్ధికి రూ. 10 లక్షలు, కాముడుపెంట యూత్ భవనానికి రూ. 5 లక్షలు, స్లాటర్ హౌజ్ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్ పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్, బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షుడు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

పెగడపల్లి:మండలంలోని బతికపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఎలుగొండ కృష్ణహరి తండ్రి హన్మంతు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. వారివెంట సర్పంచ్ శోభారాణి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములుగౌడ్, మాజీ సర్పంచి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

రాయికల్: పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా పట్టణంలోని అన్ని వార్డుల్లో మురికికాలువల్లో చెత్తను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అలాగే ఓపెన్ ప్లాట్స్ యజమానులకు నోటీసులు జారీ చేశారు. నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కమిషనర్ సంతోష్‌కుమార్, మేనేజర్ వెంకటి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'బహుజనుల బతుకులు మారేది బీఎస్పీతోనే'

గొల్లపల్లి: బహుజనుల బతుకులు మారేది బీఎస్పీ పార్టీతోనేనని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క విజయ్ అన్నారు. మండలంలోని దట్నూర్‌లో శుక్రవారం బీఎస్పీ ఆధ్వర్యంలో గడప గడపకు గజరాజు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నక్క విజయ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో తమ బతుకులు మారలేదని, బీఆర్‌ఎస్ పాలనలో సొంతింటి కల నెరవేరలేదని, పింఛన్ రాని దివ్యాంగులు, వృద్ధులు ఎందరో న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో బీఎస్పీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు కుశనపెల్లి శ్రీనివాస్, గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు హన్మండ్లు నాయకులు గంగాధర్, కల్లెపెల్లి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

మల్యాల: చొప్పదండి నియోజకవర్గ అభివృద్ధి ఘనత బీఆర్‌ఎస్ సర్కారు దేనని, మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండల కేంద్రంలోని లక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో మండలంలోని తాటిపెల్లి, తక్కలపల్లి, బల్వంతపూర్ గ్రామానికి చెందిన 100 మంది ప్రజలు, మల్యాల మండలానికి చెందిన బీఎస్పీ యువ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి కండువాలు కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రాంపూర్‌లో రూ.20 లక్షల నిధులతో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర భవనానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గర్భిణులకు న్యూట్రిషన్ కిట్‌లు, అమ్మఒడి, ఆరోగ్య మహిళా సంరక్షణ, వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కేవలం ఎన్నికల సమయంలోనే వచ్చిపోయే నాయకుడిని కాదని, 24 గంటలు మీకు అందుబాటులో ఉంటానన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొండపల్కల రాం మోహన్ రావు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, పాక్స్ చైర్మన్ సాగర్ రావు, మధుసూధన్, ఎడిపెల్లి అశోక్, శ్రీలత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నెట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని జ్యోతి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ హరిచరణ్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు, క్రీడలకు కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు శరణ్య, సంజన, వైష్ణవి, రాగిని, రోహిత్, విశ్వరోహణ్, కాహిద్ ఈ నెల 9, 10, 11 తేదీల్లో నిర్మల్ జిల్లాల్లో జరిగే 6వ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీధర్, మాణికరావు, అజిత, గౌతమ్, సుభాశ్ పాల్గొన్నారు.

పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వకపోవడం బాధాకరం

కథలాపూర్: వేములవాడ నియోజకవర్గంలో పేదలకు ప్రభుత్వ పరంగా డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వకపోవడం బాధాకరమని బీఆర్‌ఎస్ నియోజకవర్గ నేత గోలి మోహన్ అన్నారు. కథలాపూర్ మండలం తాండ్ర్యాలలో బత్తుల రాజు అనే వ్యక్తి ఇల్లు వర్షానికి కూలిపోవడంతో శుక్రవారం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి రూ. 5 వేలు ఆర్థికసాయం అందించారు. వచ్చే ఎన్నికల్లో తాను బరిలో ఉంటానని, ప్రజలు అండగా ఉండాలని కోరారు.

పాలిటెక్నిక్ అధ్యాపకుల నిరసన

కోరుట్ల: పాలిటెక్నిక్ కళాశాలల్లో బదిలీలు చేపట్టాలని కోరుతూ స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకులు శుక్రవారం భోజన విరామంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బదిలీల కమిటీ జేఏసీ కన్వీనర్ గసికంటి మల్లిఖార్జున్ మాట్లాడుతూ ఐదున్నరేళ్ల క్రితం బదిలీలు జరిగాయని, మళ్లీ ఇప్పటి వరకూ ఎలాంటి బదిలీలు చేపట్టలేదన్నారు. ఉద్యోగులు, ప్రభుత్వ ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం వెంటనే బదిలీల ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు.

బీసీ సింహగర్జన విజయవంతం చేయాలి

గొల్లపల్లి: ఈ నెల 10న సరూర్‌నగర్ లో జరిగే బీసీ సింహగర్జనను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఓరుగంటి భార్గవరామ్ అన్నారు. తెలంగాణతో పాటు దేశ వ్యాప్తంగా బీసీ జనాభా అధికంగా ఉన్నప్పటికీ, రాజ్యమేలుతుంది మాత్రం కేవలం 9 శాతం ఉన్న అగ్రవర్ణాలేనని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బంగుడపు తిరుపతి, జిల్లా కార్యదర్శి కాళ్ల రాజయ్య పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

జగిత్యాల/జగిత్యాలరూరల్: పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీఆర్‌నగర్, జగిత్యాల మండలం జాబితాపూర్‌లో పోషక మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారన్నారు. పిల్లల పెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జానకి, పోషణ్ అభియాన్ బ్లాక్ కో–ఆర్డినేటర్ శ్రీధర్, ఏఎన్‌ఎం విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

రాయికల్: మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన ఎనుగంటి మహేందర్‌కు ఎంబీబీఎస్‌లో సీటు రావడంతో శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల తిరుపతి మహేందర్‌ను సన్మానించారు. ఆయన వెంట బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కోల శంకర్, రామాజీపేట అధ్యక్షుడు చిలువేరి నాగరాజు, నాయకులు నర్సయ్య, శైలేందర్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

నిత్యావసర సామగ్రి అందజేత

కోరుట్ల: పేదరికంతో కన్నకొడుకు అంత్యక్రియలకు డబ్బులు లేక బంధువులు రాక ఇబ్బంది పడిన పూసల మంజు అనే మహిళా కూలీ దీనస్థితిపై ఈ నెల 2వ తేదీన అంత్యక్రియలకు ఆ నలుగురు కరువు అన్న శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఇబ్రహీంపట్నం మండలం బండలింగాపూర్‌కు చెందిన ఆత్మకూరు రాజు–మానస దంపతులు స్పందించారు. తమ కూతురు చరిత మొదటి పుట్టిన రోజును పురస్కరించుకుని పూసల మంజుకు రూ. 5 వేల విలువైన బియ్యం, పప్పులు, నూనె ఇతర నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో బ్లడ్ డోనర్స్ సంధానకర్త ఉదయ్, సామాజిక సేవకుడు రఫీ, తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో కృష్ణాష్టమి వేడుకలు

మెట్‌పల్లిరూరల్: మండలంలోని చౌలమద్ది శివారులోని ఇస్కాన్ ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం అర్ధరాత్రి వరకు వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రాధాకృష్ణులకు అభిషేకం, మహా హారతి నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు శ్రీమాన్ నరహరిదాస్ ,ఆత్మనగర్ సర్పంచ్ శ్రీనివాస్,భక్తులు పాల్గొన్నారు.

గొల్లపల్లి :మండలంలోని దట్నూర్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం కృష్ణాష్టమి వేడుకలు, ఉట్టి ఉత్సవం ఘనంగా నిర్వహించారు.గోపిక, రాదా కృష్ణుడి వేషధారణలు, ఉట్టి కొట్టడం అలరించాయి.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



కోరుట్ల: పట్టణంలోని అష్టలక్ష్మీ ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బూరుగు రామస్వామి గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి ఆలయంలో లలిత సహస్ర పారాయణం

జగిత్యాలటౌన్: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని శుక్రవారం జగిత్యాల పట్టణంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో భక్తి శ్రద్ధలతో లలిత సహస్ర పారాయణం చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు టీవీ సత్యం, పట్టణ అధ్యక్షుడు సంకోజి వెంకటరమణ,మహిళలు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సతీశ్ శుక్రవారం తెలిపారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కొరారు.

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రంలోని జగిత్యాల టౌన్–1 సెక్షన్‌లో 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని టౌన్–1 పరిధిలో రాంబజార్, పురాణిపేట, అంగడి బజార్, యావర్‌రోడ్, మార్కెట్ బ్యాక్‌సైడ్, కృష్ణనగర్, అరవింద్‌నగర్, మార్కండేయ టెంపుల్ ఏరియా, టాకాసంది, సాయిరాంనగర్, గోవిందుపల్లి, శ్రీరాంనగర్, వెంకటాద్రినగర్‌లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఏఈ అశోక్ తెలిపారు.

రాయికల్: రాయికల్ పట్టణ, మండలంలోని మైతాపూర్, కుమ్మరిపల్లి గ్రామాల్లో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ అర్జున్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

14, 15న మండల స్థాయి పాఠశాలల క్రీడల ఎంపిక పోటీలు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 14, 15న ఇబ్రహీంపట్నం మండల పాఠశాలల క్రీడాల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంఈవో ఆనందరావు, కాంప్లెక్స్ హెచ్‌ఎం గణేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. 14న అండర్ 14, అండర్–17 బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్ పోటీలు, 15న అండర్ –14,అండర్ –17 బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనే విద్యార్థులు 14 న ఉదయం 9 గంటలకు ఇబ్రహీంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆధార్‌కార్డు, ఇతర సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో సంప్రదించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9440037393, 9441183035 నంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు.